క్లుప్తంగా

పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న ఎంఈఓ

బత్తలపల్లి: గరిశలపల్లిలో ఆదివారం పాముకాటుతో మృతి చెందిన 1వ తరగతి విద్యార్థి మబ్బు యశ్వంత్ తల్లిదండ్రులను ఎంఈఓ సుధాకర్ నాయక్ పరామర్శించారు. సోమవారం గరిశలపల్లికి చేరుకున్న ఆయన ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరయ్య, సీఆర్పీ వెంకటరమణతో కలిసి యశ్వంత్ ఇంటికి చేరుకున్నారు. తల్లిదండ్రులు నరేష్, లక్ష్మిని పరామర్శించి, బాలుడి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ఘటనపై నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. .

కనులపండువగా కల్యాణోత్సవం

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత వసంత వల్లభునికి సోమవారం అర్చకులు ఆర్జిత కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించి వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఉత్సవం జరిపించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు శుభాకాంక్షలు

నల్లచెరువు: నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్ రవికుమార్‌ను మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, డీలర్లు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అశోక చక్రవర్తి, రేషన్ డీలర్లు జయచంద్రారెడ్డి, వేమారెడ్డి, బాలాజీ నాయక్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ మెంబర్‌కు ఘన సన్మానం



జీవీ సుధాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న ముస్లింలు

కదిరి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు జీవీ సుధాకర్‌రెడ్డిని సోమవారం పట్టణ ముస్లింలు ఘనంగా సన్మానించారు. న్యాయవాది పఠాన్‌జాఫర్ ఖాన్ స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి షాకీర్ మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జీవీ సుధాకర్‌రెడ్డి చేస్తున్న కృషిని అభినందనీయమన్నారు. వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు నూరుల్లా మాట్లాడుతూ 4 శాతం రిజర్వేషన్ కల్పించి మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింల గుండెల్లో నిలిచి పోయారని, ఆయన తనయుడు వైఎస్ జగన్ ఇమాం, మౌజన్‌లకు గౌరవ వేతనాలు ఇవ్వడంతో పాటు ఎంతో మందిని హజ్‌కు పంపారని కొనియాడారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారిణి శ్రావణితో అధ్యాపకులు

ధర్మవరం అర్బన్: జాతీయస్థాయి హాకీ పోటీలకు తమ విద్యార్థిని ఎంపికకావడం హర్షణీయమని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గుట్టకిందపల్లిలో ఉన్న కళాశాలలో సోమవారం విద్యార్థిని శ్రావణిని అభినందించారు.

వాటర్ ట్యాంకు వితరణ

ధర్మవరం అర్బన్: ఇందిరానగర్‌లోనున్న కాశిరెడ్డినాయన ఆశ్రమానికి యువర్స్ ఫౌండేషన్ సభ్యులు వాటర్ ట్యాంకును సోమవారం వితరణ చేశారు. వంకదారి రామచంద్రగుప్త తన భార్య సుజాతమ్మ జ్ఞాపకార్థం వాటర్ ట్యాంకును ఆశ్రమ నిర్వాహకులు శివారెడ్డి, మురళికి అందించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు వైకే శ్రీనివాసులు, కార్యదర్శి సుకుమార్, కోశాధికారి రాధాకృష్ణ, సుబ్బారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ

రామగిరి: అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన కురుబ సుబ్బమ్మ (68) మృతదేహాన్ని హిందూపురం ఎంపీ గోరంట్లమాధవ్ సందర్శించారు. మండలంలోని దుబ్బార్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కురుబ జయచంద్ర (డీలర్) తల్లి మృతి చెందడంతో వైఎస్సార్‌సీపీ మండల నాయకులతో కలిసి వచ్చి ఎంపీ నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగార్జున, ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాలప్ప, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, సెబ్ సీఐ లక్ష్మీదుర్గయ్య



కదిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది



ఓడీ చెరువులో విద్యార్థుల ర్యాలీ

- యువతకు పోలీసుల పిలుపు
- విద్యార్థులతో కలిసి ర్యాలీలు

ధర్మవరం అర్బన్: మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ శ్రీనివాసులు, సెబ్ సీఐ లక్ష్మీదుర్గయ్య, టూటౌన్ సీఐ రాజా, సెబ్ ఎస్‌ఐ సుశీలమ్మ తెలిపారు. పట్టణంలో సోమవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ గంజాయి, నల్లమందు, బ్రౌన్ షుగర్ తయారీ, అమ్మడం, రవాణా చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. కార్యక్రమంలో సెబ్ హెడ్‌కానిస్టేబుళ్లు రమేష్, రమేష్ బాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కదిరిలో..

కదిరి టౌన్: పట్టణంలో సోమవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి కదిరి డీఎస్పీ శ్రీలత ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ సర్కిల్‌లో విద్యార్థులు మానవహారం ఏర్పాటు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలన్నారు. సీఐలు సూర్య నారాయణ, శంకర్‌నాయక్ తదితరులున్నారు.

పోస్టర్ల విడుదల

కదిరి అర్బన్: పట్టణంలోని రూరల్ అప్‌గ్రేడ్ పోలీ స్టేషన్‌లో సోమవారం దళిత చైతన్య సమితి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లను రూరల్ సీఐ సూర్యనారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బాబ్జాన్, సీపీఐ డివిజన్ కార్యదర్శి యాదల్ల, రాజేష్, ఏఐఎస్‌ఎఫ్ నాయకలు ఉపేంద్ర, బాలకృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

బత్తలపల్లిలో...

బత్తలపల్లిలో ఎస్‌ఐ శ్రీహర్ష, సెబ్ పోలీసులు ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్, మత్తు పదార్థాలు గంజాయి, గుట్కా ఉపయోగిస్తే చర్యలు తప్పవని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.

భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

గాండ్లపెంట: యువత వ్యసనాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి కోరారు. మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సోమవారం ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను తెలిపారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామయ్య, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ముంతాజ్అలీ, పీడీ హరిప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు..

ఓడీ చెరువు: మాదక ద్రవ్యాలకు బానిస కావద్దని సెబ్ సీఐ సైదులు, ఎస్‌ఐ శ్రీధర్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం ఓడీ చెరువు మండల కేంద్రంలో విద్యార్థులు,పోలీసులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్ నుంచి బస్టాండ్ వరకు ప్లకార్డులతో విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. అంబేడ్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి సీఐ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఓడీ చెరువు ఎస్‌ఐ గోపి, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలు

ఎన్‌పీకుంట: మాదకద్రవ్యాల వినియోగం ఎన్నో అనర్థాలకు దారితీస్తుందని ఎస్‌ఐ సద్గురుడు తెలిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, వైఎస్సార్ కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తలుపులలో..

తలుపుల: అంతర్జాతీయ డ్రగ్ నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఎస్‌ఐ మగ్బుల్‌బాష ఆధ్వర్యంలో మహిళా పోలీసులు, విద్యార్థులు ర్యాలీ నర్విహించారు. ప్రభుత్వహైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

యువత దూరంగా ఉండాలి

తనకల్లు: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ రాంభూపాల్ అన్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక జాతీయ రహదారిపై విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. జాతీయ రహదారిపై మానవహారాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలువురు పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు విక్రయిస్తే చర్యలు

కనగానపల్లి: నిషేధిత మాదక ద్రవ్యాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ హనుమంతరెడ్డి తెలిపారు. సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ విద్యార్థులకు స్థానిక పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదకద్రవ్యాలు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందాం

చెన్నేకొత్తపల్లి: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందాం..ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అని రామగిరి సీఐ గౌస్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కస్తూర్బా స్కూల్ విద్యార్థులతో అంతర్జాతీయ మాదవ ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పొగాకు, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీధర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ స్వర్ణలత, కస్తూర్బా పాఠశాల ఎస్‌ఓ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.



చెన్నేకొత్తపల్లిలో..

పర్తికి పయనమైన వార్కరీలు



భజనలతో ముందుకు సాగుతున్న భక్తులు

ప్రశాంతి నిలయం/ధర్మవరం: మహారాష్ట్ర, గోవాకు చెందిన వార్కరీలు (పాండురంగడి భక్తులు) సోమవారం ధర్మవరం నుంచి పుట్టపర్తికి పాదయాత్రగా బయలుదేరారు. దాదాపు 1,500 మంది తొలుత ధర్మవరంలోని శిరిడి సాయి ఆలయానికి చేరుకున్నారు.సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు స్వాగతం పలికి, వార్కరీ సంప్రదాయాన్ని పాటిస్తూ పాండురంగడని కీర్తిస్తూ భజనల్లో పాల్గొన్నారు. అనంతరం శిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై పాండురంగడు, రుక్మిణిమాత చిత్రపటాలను ఉంచి ఊరేగింపుగా బయలుదేరారు. రత్నాకర్‌ను శిరిడి సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షుడు సూర్య ప్రకాష్, కోశాధికారి హేమంత్‌కుమార్ తదితరులు శాలువాలు, పుష్పగుచ్ఛంతో సన్మానించారు.

ఘనంగా ఎమ్మెల్సీ తలశిల జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నల్లమాడ: ఎమ్మెల్సీ తలశిల రఘురాం జన్మదిన వేడుకలను సోమవారం నల్లమాడలో వైఎస్సార్ సీపీ నాయకులు టీడీ కృష్ణమున్‌రెడ్డి సహకారంతో ఘనంగా నిర్వహించారు. ఒకటో సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, హైకోర్టు న్యాయవాది తలమర్ల రాము కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నాయకులు కదిరిసాని ప్రకాష్, గణేష్ ఖన్నా, డీలర్లు దుద్దుకుంట శ్రీనివాస రెడ్డి,లక్ష్మినారాయణ, నారాయణస్వామి ఉన్నారు.

మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి

- కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

కదిరి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రజలు మెచ్చిన పాలన అందిస్తున్నారని, 2024లోనూ మళ్లీ ముఖ్యమంత్రి పీఠాన్ని జగనన్న రెండోసారి అధిష్ఠించడం ఖాయమని కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ధీమా వ్యక్తపరిచారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే పట్టణంలోని 17వ వార్డులో పర్యటించారు. గడప గడపకూ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. టీడీపీ హయాంలో అర్హత ఉన్నా ఆ పార్టీ నాయకులు చెబితేనే సంక్షేమ పథకాలు అందేవని, ఇప్పుడు పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందుతున్నాయని ఎంతోమంది ఎమ్మెల్యేతో అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు.

మోసం..చంద్రబాబు నైజం

అబద్ధపు హామీలతో చంద్రబాబు 2014లో గద్దెనెక్కి ప్రజలకిచ్చిన ఒక్క హామీ కూడా పూర్తి స్థాయిలో నెరవేర్చలేదని ఎమ్మెల్యే డా.సిద్దారెడ్డి ఆరోపించారు. భవిష్యత్‌కు గ్యారంటీ పేరుతో టీడీపీ చేపట్టిన బస్సుయాత్రకు ప్రజల మద్దతు ఏమాత్రం లేదన్నారు. ఇంటింటికీ కిలో బంగారం ఇస్తామన్నా ప్రజలు చంద్రబాబు మాటలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఎల్లోమీడియా చంద్రబాబును జాకీలతో లేపాలని ఎంత ప్రయత్నించినా జగన్ ప్రజా బలం ముందు వారి రాతలు వృథా అని తేలిపోయిందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎల్లోమీడియా ప్రతిరోజూ తప్పుడు కథనాలు రాస్తోందని, అందుకే ఆ పత్రికలను చూసి ప్రజలు ఛీదరించుకుంటున్నారని తెలియజేశారు.

సమస్యల పరిష్కారం కోసం ఆదేశం

17వ వార్డులో ప్రజలు తన దృష్టికి తెచ్చిన పలు సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కొన్ని వీధుల్లో కరెంటు స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరితే.. వెంటనే అక్కడే ఉన్న ఎలక్ట్రికల్ ఇంజినీర్‌తో మాట్లాడి తక్షణం పరిష్కరించాలని చెప్పారు. కొన్ని చోట్ల సిమెంటు రోడ్లు, కాలువల నిర్మాణంపై కోరితే సంబంధిత ఇంజినీరింగ్ అసిస్టెంట్‌తో మాట్లాడి త్వరితగతిన వాటి నిర్మాణం పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఇళ్లకు నేరుగా వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సాదిక్, ఎస్‌ఎండీ ఇస్మాయిల్, ప్రణీత్‌రెడ్డి, బూత్ మేనేజర్ అన్సర్, పిచ్చిలి శంకర్, ఖలందర్, వలీ, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బాలసముద్రంలో..

తనకల్లు: మండల పరిధిలోని బాలసముద్రం పంచాయతీ పరిధిలోని గ్రామాలలో ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7:30 గంటలకు గోవిందువారిపల్లి గ్రామంలో ప్రారంభమవుతుందన్నారు.

ప్రతి ఇంటినీ సందర్శించాలి

ఎన్‌పీకుంట: 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, గృహసారథులు, గ్రామకన్వీనర్లు ప్రతి ఇంటినీ సందర్శించాలని ఎంపీపీ ఈటిరాము అన్నారు. ఎన్.పీ.కుంట-1, 2, ధనియానిచెరువు, వెలిచలమల గ్రామ సచివాలయాలలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 11 రకాల ఉచిత సేవల గురించి వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కేవరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, ఎంపీటీసీ తిమ్మారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సుబహాన్, సర్పంచ్ దిల్షాద్, వాటర్‌షెడ్ చైర్మెన్ బయారెడ్డి, ఎంఎల్‌ఓ షాజహాన్, ఉపసర్పంచ్ భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: వేపరాల, కురుమామిడి, సోమయాజులపల్లి గ్రామాల్లో సోమవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమంపై ఎంఎల్‌ఓ బాబ్‌జాన్, కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీఎస్ మండల కన్వీనర్ గజ్జలరవీంద్రారెడ్డి మాట్లాడుతూ జులైలో దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి ధృవీకరణ పత్రాలు అధికారులు అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తాతం జగన్మోహన్,కురుమామిడి సర్పంచ్ సుధాకర్, సచివాలయ కన్వీనర్‌లు నాగార్జునరెడ్డి, లోకేశ్వరరెడ్డి, రమణా నాయక్, సిద్దారెడ్డి, ఖాజా, ఆర్బీకే చైర్మన్ శంకర్ నాయుడు, రామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి అన్ని గ్రామాల్లో..

చెన్నేకొత్తపల్లి: జూలై 1 నుంచి అన్ని గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ అనురాధ, ఎంపీడీఓ గంగావతి తెలిపారు. 1న కనుముక్కల-1, 4న గంగినేపల్లి, 6నకనుముక్కల-2, 7న మేడాపురం-1, 11న మేడాపురం-2, 13న వెంకటంపల్లి, 15న ప్యాదింటి, 18న నాగసముద్రం, 20న చెన్నేకొత్తపల్లి -1, 22న న్యామద్దల-2, 28న ముష్టికోవెల పరిధిలో కార్యక్రమం జరుగుతుందన్నారు.

జయప్రదం చేద్దాం

కనగానపల్లి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కనగానపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని కనగానపల్లి, బాలేపాళ్యం, కోనాపురం గ్రామాల్లో పనిచేసే సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణపై ఎంఎల్‌ఓ ఆదిశేఖర శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్, ఎంపీడీఓ అలివేలమ్మ, డైరెక్టర్ ప్రభాకర్, ఎంపీటీసీ రాజేశ్వరీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, యూత్ కన్వీనర్ అశోక్, నాయకులు నాగముని, రామకృష్ణ, అమరనాథ్, సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పరిశీలన

నల్లచెరువు:మండల పరిధిలోని రాత్నాలపల్లి, చిన్న ఎల్లంపల్లి గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న సర్వేని సోమవారం ఎంపీపీ రమణారెడ్డి,ఎంపీడీఓ శకుంతల, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, సర్పంచ్ శ్రీనాథ్‌రెడ్డి పరిశీలించారు. వలంటీర్లతో కలిసి గ్రామాలలోని ప్రతి ఇంటినీ సందర్శించి వారి సమస్యలు తెలుసుకొని సమస్య పరిష్కారానికి అవసరమైన రికార్డులను వలంటీర్లు సేకరించారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు సానే హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులకు ధ్రువీకరణ పత్రాలు

తనకల్లు: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అర్హులకు ధ్రువీకరణ పత్రాలను అందజేయనున్నట్లు ఎంపీపీ వైవీ కౌసల్య అన్నారు. మండల పరిధిలోని కొక్కంటిలో సోమవారం ఇంటింటా చేపట్టిన జగనన్న సురక్ష సర్వేని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశ్వరీ, ఈఓఆర్డీ ఆనందయ్య, కార్యదర్శి బాబ్‌జాన్, వలంటీర్లు పాల్గొన్నారు.

బాలికలను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి

ధర్మవరం అర్బన్: బాలికలను అక్రమ రవాణా చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయి తెలిపారు. ధర్మవరం పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జడ్జిలు మాట్లాడుతూ ఆడపిల్లలను ఎవరైనా అక్రమ రవాణా చేయాలని ప్రయత్నించినా, చేసినా వారికి కఠిన శిక్షలు పడతాయని వివరించారు. యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు బాలసుందరి, దస్తగిరి, బిల్లే రవి, మోహన్‌ప్రసాద్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. సదస్సుకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రతిమ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సుందరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. బాగా చదువుకుని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత, బార్ అసోషియేషన్ అధ్యక్షులు లింగాల లోకేశ్వరెడ్డి ,సీనియర్ న్యాయవాది నరసింహులుతో పాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగిన బాలుడు

ధర్మవరం అర్బన్: పురుగుల మందు డబ్బాతో ఆడుకుంటూ అందులోని పురుగులమందును బాలుడు తాగిన సంఘటన ధర్మవరం పట్టణంలో సోమవారం జరిగింది. పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో నాగేష్, రాజేశ్వరి దంపతుల మూడేళ్ల కుమారుడు జోనాథన్ ఇంటి వద్ద పిల్లలతో ఆడుకుంటుండగా చెట్ల పొదల్లో ఉన్న పురుగులమందు డబ్బా దొరికింది. డబ్బాను తెరిచి మందును తాగాడు. గమనించిన తల్లిదండ్రులు వెంటనే బాలుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మామిడికి బీమా సౌకర్యం కల్పించండి



మంత్రికి వినతి పత్రం సమర్పిస్తున్న రమణారెడ్డి

పుట్టపర్తి: మామిడి పంటకు బీమా సౌకర్యం కల్పించాలని జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి కోరారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్దన్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. సోమవారం 26 జిల్లాల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్లతో మంత్రి అమరావతిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ తదితర అంశాలపై రమణారెడ్డి మంత్రితో చర్చించారు. ఏటా ప్రకృతి వైపరీత్యాల కారణంగా మామిడి పంట దెబ్బతింటోందన్నారు. బీమా సౌకర్యం కల్పించి రైతులను ఆదుకోవాలని కోరారు. చిరుధాన్యాల పరిశోధన కేంద్రం, మొక్కజొన్న పంటల రక్షణకు సబ్సిడీపై ఫెన్సింగ్, పట్టు రైతులకు కేజీకి రూ.50 బోనస్ తదితర సమస్యలకు పరిష్కారం చూపాలని వినతి పత్రంలో రమణారెడ్డి పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



తమ ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ప్రశాంతి నిలయం: వారందరి ప్రాంతాలు వేరైనా ఒకే చోటు చేరి చదువుకున్నారు. మళ్లీ 43 ఏళ్ల తరువాత ఒక్క చోట చేరి సందడి చేశారు. 1980–81 పుట్టపర్తిలోని ఈశ్వరమ్మ ఉన్నత పాఠశాల పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం ఘనంగా జరిగింది. సత్యసాయి ఎయిర్ పోర్టు ఎదురుగా గల సాయి ప్రశాంతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికలో 100 మందికి పైగా పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలసి పాల్గొన్నారు. ఆ నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సత్యనారాయణ, లక్ష్మినరసప్ప, ఆంజినేయులు, మల్లిఖార్జున, దేవేంద్ర గుప్తా, నారాయణ స్వామి తదితరులను దుశ్శాలువలు, జ్ఞాపికలతో సన్మానించారు. ఆ నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని మురిసిపోయారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నారపరెడ్డి, సంగప్ప, గోవిందు, ఉపాధ్యాయుడు రాధాక్రిష్ణ, మధుసూదన్‌రెడ్డి, రమేష్ రెడ్డి, అనసూయమ్మ ఆల్లాబకాష్ తదితరులున్నారు.

ఫైబర్ నెట్ సౌకర్యం కల్పించాలి

నల్లమాడ: మండలానికి ఫైబర్ నెట్ సౌకర్యం కల్పించాలని కోరుతూ రైతు రక్షణ, సంక్షేమం, అభివృద్ధి అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం 'స్పందన' కార్యక్రమంలో తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షులు మట్రా రాజశేఖర్, కార్యదర్శి చంద్రమోహన్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ నల్లమాడ మండలానికి ఫైబర్ నెట్ సౌకర్యం లేకపోవడంతో ప్రభుత్వ పథకాలపై ఉన్నతాధికారులు నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లకు మండల అధికారులు ఓడీ చెరువు, కదిరి, పుట్టపర్తికి పరుగులు తీయాల్సి వస్తోందన్నారు. నాయకులు, వైస్ ఎంపీపీ కే. సూర్యనారాయణ, సహకార సంఘం మాజీ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, అంజనప్ప ఉన్నారు.

రేపు చేపల చెరువు వేలం

ఎన్‌పీకుంట: దనియానిచెరువు పంచాయతీ పరిధిలోని చేపల చెరువుకు బుధవారం స్థానిక సర్పంచ్ దిల్షాద్ అధ్యక్షతన బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఉమారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సచివాలయంలో వేలం పాట నిర్వహిస్తారని, పాల్గొనే వారు ఉదయం 10 నుంచి 11 గంటల లోపు రూ.5,000 డిపాజిట్ చెల్లించాలన్నారు. పాడిన మొత్తం సొమ్మును వెంటనే చెల్లించాలని, ఎటువంటి వాయిదాలు అంగీకరించమని స్పష్టం చేశారు.